నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

3 | నిజామాబాద్ ఆదివారం 9 మార్చి 2025 | ADILABAD NIRMAL




## మహిళా న్యాయమూర్తులకు సన్మానం

సన్మానిస్తున్న రెండో అదనపు న్యాయమూర్తి శివరాంప్రసాద్

ఎదులాపురం,మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం డీఎల్ఎస్ఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెండో అదనపు న్యాయమూర్తి శివరాం ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులను శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, న్యాయమూర్తులు ప్రమీల జైన్, కలిందే తులసీ దుర్గారాణి, హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్ పాల్గొన్నారు.

## జాన్సన్ నాయక్‌ను అభినందించిన కేటీఆర్

కడెం, మార్చి 8 : ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఆరుగురు మలేషియా దేశంలోని జైలులో మగ్గుతున్న విషయాన్ని వారి కుటుంబ సభ్యులు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌కు తెలిపిన విషయం విధితమే. ఈ మేరకు జాన్సన్ నాయక్ వారి విడుదల కోసం మలేషియాకు వెళ్లి బాధితులను కలిసి నేన్నానంటూ భరోసా ఇచ్చారు. జాన్సన్ నాయక్‌ను ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడి పోయినప్పటికీ, నిత్యం ప్రజలలో ఉంటూ కష్టాల్లో ఉన్న నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్న తీరును ప్రశంసించారు.




'ఎక్స్'లో కేటీఆర్ పోస్టు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జాన్సన్ నాయక్

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని రెబ్బెనపల్లి చెరువులో అడుగంటిన నీరు



● చెరువు ఎండెన్..

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ముక్కాసిగూడలో నీరు లేక ఎండిన పొలాలు



● నెర్రలువారిన నేల

# జలం అధఃపాతాళం

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పడిపోయిన నీటిమట్టాలు**

కాంగ్రెస్ తెచ్చిన కరువు

● ఎండాకాలం ప్రారంభానికి ముందే ఆందోళనకర పరిస్థితి ● గతేడాదితో పోలిస్తే ఈసారి భారీగా పడిపోయిన భూగర్భ జలాలు

● చెరువుల్లో నీరు లేక, బోర్లపై ఆధారపడుతున్న రైతన్నలు ● పంటలకు సరిపడా తడులు అందించలేక సతమతం

మంచిర్యాల, మార్చి 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గడిచిన నాలుగేళ్లలో ఎప్పుడూ లేని స్థాయిలో నీటి వనరులు అధఃపాతాళానికి పడిపోయాయి. గతేడాది ఈ సమయంలో మంచిర్యాల జిల్లాలో 6.26 అడుగుల నీటిమట్టం ఉంటే.. ఇప్పుడు 6.63 మీటర్ల లోతులో ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది 7.40 మీటర్ల నీరు ఉండగా ఈ ఏడాది 8.54 మీటర్లకు చేరాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గతేడాది 7.13 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం 7.35 మీటర్లు, నిర్మల్ జిల్లాలో గతేడాది 7.87 మీటర్ల లోతులో నీరుండగా ఈ ఏడాది 9.07 మీటర్లకు నీటిమట్టం పడిపోయింది. వేసవి ప్రారంభానికి ముందే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరింత దారుణంగా మారొచ్చని అధికారులు అంటున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. ఆదిలాబాద్ జిల్లా సాత్నాల, నిర్మల్ జిల్లాలో గడ్డెన్న వాగు, కడెం ప్రాజెక్టులతోపాటు మంచిర్యాల శివారు పెద్దపల్లి జిల్లా పరిధిలోకి వచ్చే ఎల్లంపల్లి ప్రాజెక్ట్, ఆసిఫాబాద్ జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్ట్‌లోకి భారీగా నీరు చేరింది. కానీ.. రెండేళ్ల క్రితం మాదిరి వరదల సమయంలో చెరువులను నింపకపోవడం కొంత ఇబ్బందిగా మారింది. అటు ప్రాజెక్టుల్లో నీరు దగ్గరపడడం, ఇటు చెరువులు ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.


### చివరి ఆయకట్టు రైతులకు నీటి కష్టాలు

కడెం చివరి ఆయకట్టుగా ఉన్న మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సాగు నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. దండేపల్లి మండలంలోని ముక్కాసిగూడలో ఇప్పటికే 50 ఎకరాల దాకా వరి పంట నీరు లేక ఎండిపోతున్నది. కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువల నీరు జన్నారం మండలంలోని తపాల్‌పూర్ దాకే వస్తున్నది. దండేపల్లి మండలంలోని చాలా గ్రామాలకు ఆ నీరు రావడం లేదు. నిర్మల్ జిల్లా గడ్డెనవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. కేసీఆర్ సర్కారు రూ.6 కోట్లతో 20 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం పూర్తి చేయించింది. మరో 8 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండడంతో భైంసా, లోకేశ్వరం మండలాల్లోని పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే వరి అధికంగా సాగు చేసే జిల్లాలైన మంచిర్యాల, నిర్మల్ జిల్లాల రైతులు అటు ప్రాజెక్టుల నీరు రాక, ఇటు చెరువుల్లో నీరు లేక ఎక్కువగా బోర్లపైనే ఆధారపడుతున్నారు. పదేళ్ల క్రితం ఎలాగైతే బోర్లపై ఆధారపడి సాగు చేశామో ఇప్పుడు అదే పరిస్థితి వచ్చిందని చెప్తున్నారు. బోర్లు లేని రైతులు కొత్తగా బోర్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో భూగర్భంలోనూ నీటిమట్టాలు అడుగంటిపోతుండడం రైతులకు కష్టంగా మారనుంది. గతంలో 100 ఫీట్లకు బోరు పడిన చోట ఇప్పుడు 150 ఫీట్ల నుంచి 200 ఫీట్ల వరకు బోరు వేయాల్సి వస్తుంది. దీంతో రైతులపై అదనపు భారం పడుతున్నది. అదృష్టం బాగుండి బోరు పడితే పర్లేదు.. కానీ కర్మకాలి బోర్ ఫెయిలయ్యిందా రైతులపై లక్షల రూపాయల అదనపు భారం పడుతుంది.

### ఐదు మండలాల్లో పాతాళానికి..

మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం సగటున 6.63 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా ఐదు మండలాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. జైపూర్ మండలంలో 18.19, కోటపల్లిలో 16.59, తాండూర్‌లో 15.12, బెల్లంపల్లిలో 15.03, మందమర్రిలో 12.73 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టాలు ఉన్నట్లు భూగర్భ గనుల శాఖ తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. మిగిలిన మండలాల్లో పరిస్థితి కాస్తా మెరుగ్గా ఉంది. గడిచిన రెండేళ్లలో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. 2022 సంవత్సరంలో ఈ సమయానికి 5.96 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, 2023లో 5.95 మీటర్లు ఉన్నాయి. 2024లో ఒక్కసారిగా 6.26 మీటర్లకు పడిపోయిన జలమట్టం ప్రస్తుతం 6.63 మీటర్లకు దిగజారింది. మండు వేసవిలో మరింత లోలోతుకు జలమట్టం పడిపోయే అవకాశాలు ఉన్నాయి.






దండేపల్లి మండలంలోని ముక్కాసిగూడలో ..

# దూది రైతుల దుఃఖం

● నాణ్యత పేరిట పత్తి కొనుగోళ్లను నిరాకరిస్తున్న సీసీఐ ● ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్న రైతులు

ఆదిలాబాద్, మార్చి 8(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్వాకం వల్ల ఆదిలాబాద్ జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. పత్తిని కొనాల్సిన సీసీఐ కార్పొరేట్ సంస్థల మాదిరిగా వ్యాపార ధోరణితో వ్యవహరిస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సీజన్ ప్రారంభంలో తేమ అధికంగా ఉందంటూ కొనుగోళ్లను నిరాకరించిన సీసీఐ.. ఇప్పుడు నాణ్యత తగ్గిందంటు ధర తగ్గిస్తున్నది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉండగా.. ఏకంగా రూ.100 తగ్గించి రూ. 7,421తో కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. కొనుగోళ్లు చివరి దశకు చేరుకోగా.. రైతులు తమ వద్ద ఉన్న పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సీసీఐకి విక్రయించడానికి తీసుకొస్తున్నారు. పంట నాణ్యత లేదంటూ కొనుగోలు చేయకుండా నిరాకరిస్తుండంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటను కొనుగోలు చేయాలని బతిమిలాడిన పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. సీసీఐ సిబ్బంది నిర్వాకం ఫలితంగా ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రిజక్ట్ చేసిన పత్తి లోడ్ వాహనాలు

### రూ.40 వేలు నష్టపోయా..



*నేను పదెకరాల్లో పత్తి వేశా. దిగుబడితోపాటు నాణ్యత కూడా బాగా ఉంది. ఇప్పటికే రెండు విడుతలు పత్తిని విక్రయించిన. మిగిలిన 20 క్వింటాళ్లను సీసీఐకి అమ్ముదామని ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. పంటను పరిశీలించిన సీసీఐ అధికారులు నాణ్యత మంచిగా లేదంటూ కొనుగోలు చేయడం లేదు. ప్రైవేటు అమ్ముకుంటే క్వింటాలుకు రూ.2 వేల వరకు నష్టం వస్తున్నది. దూరం నుంచి తీసుకొచ్చిన అని బతిమిలాడినా పట్టించుకోవడం లేదు. ప్రైవేటుకు అమ్ముకుని రూ.40 వేల వరకు నష్టపోవాయా.*

**- చిన్నయ్య, రైతు, పెద్ద ఆర్లీ, భీంపూర్ మండలం**

### దళారుల పత్తినే కొంటున్నారు..



*ఆదిలాబాద్ మార్కెట్‌లో సీసీఐ సిబ్బంది వల్ల పత్తి కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులు తప్పడం లేదు. నేను మూడెకరాల్లో సాగు చేయగా.. చివరి పంట 15 క్వింటాళ్లను విక్రయించడానికి తీసుకొచ్చా. నాణ్యత బాగానే ఉన్నా.. సీసీఐ అధికారులు పత్తి మంచిగా లేదని కొనుగోలు చేయడం లేదు. నాణ్యత పట్టించుకోకుండా దళారుల వద్ద నుంచి ఐచర్ వాహనాల్లో 100 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసిన సీసీఐ అధికారులు రైతులు తీసుకువచ్చిన పంట విషయంలో సాకులు చూపుతున్నారు. సీసీఐ అధికారులు, సిబ్బంది, దళారులు, జిన్నింగ్ వ్యాపారుల కోసం పని చేస్తున్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించి రైతులు నష్టపోతున్నారు.*

**- శ్రీనివాస్, రైతు, పెద్ద ఆర్లీ, భీంపూర్ మండలం**

## రోడ్డు వేయాలని ఆమరణ నిరాహార దీక్ష

భైంసా, మార్చి 8 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణం నుంచి ఖత్‌గాం టు కామోల్ వరకు నూతన రహదారి ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి పక్కన శనివారం ఖత్‌గాం మాజీ సర్పంచ్ రాజు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి రూ.1.17 కోట్లు మంజూరయ్యాయి. అయినా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పనులు ప్రారంభించడం లేదు. పనులు ప్రారంభించేంత వరకు ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించాడు. ఆయన వెంట రాజు, మారుతి రావు, లక్ష్మణ్, అడెల్లు, గంగాధర్ ఉన్నారు. వీరికి సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సాప పండరి, మోచి సంఘం అధ్యక్షుడు సాయినాథ్, రజక సంఘం భైంసా టౌన్ అధ్యక్షుడు సుంకెట శ్రీనివాస్ మద్దతు తెలిపారు.




ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

## ఆర్జీయూకేటీ విద్యార్థుల శ్రమదానం

బాసర, మార్చి 8 : బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులకు ముథోల్ మండలంలోని విఠోలి గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహిస్తున్నారు. శనివారం మొదటి రోజు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో రమణారెడ్డి, హెచ్ఎం రమేశ్, పంచాయతీ సెక్రటరీ అనూషల సమక్షంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ విజయ్‌కుమార్, శ్రవణ్ కుమార్, రమాదేవి పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

# గర్భిణులకు శాపంగా రక్తహీనత

● బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కిట్‌తో పౌష్టికాహారం

● నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ● తాజాగా రక్తహీనతతో బాలింత శ్రీ విద్య మృతి

ఆదిలాబాద్, మార్చి 8(నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గల గర్భిణులకు రక్తహీనత శాపంగా మారింది. పౌష్టికాహారం అందకపోవడంతో ప్రసవ సమయం లో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. వైద్యసేవలు అందించినా తల్లీబిడ్డల ప్రాణాల కు ప్రమాదం ఏర్పడుతుంది. ఈ సమస్య ని వారణతోపాటు గర్భిణులకు పౌష్టికాహారం అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని అమలు చేసింది. ఈ కిట్‌లో కిలో న్యూట్రిషన్ మిల్క్ పౌడర్, కి లో ఖర్జూర పండ్లు, మూడు బాటిళ్ల ఐరన్ సిరప్‌తో పాటు, ఆర కిలో నెయ్యిని ఉంటాయి.

### నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన కేసీఆర్ కిట్ పథకం గర్భిణులు ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడింది. ఈ కిట్‌లను రెండు విడతలు అందించింది. దీంతో గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం పెరగడంతోపాటు రక్తహీనత సమస్యకు పరిష్కారం లభించింది. పౌష్టికాహారంతో కూడిన ఈ కిట్ ద్వారా మాత మరణాల రేటుతోపాటు గర్భిణులకు పౌష్టికారం అందింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఈ పథకాన్ని నిలిచివేసింది. దీంతో గర్భిణులకు 14 నెలలుగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందకపోవడంతో పోషకాహారం లభించడం లేదు.



కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ (ఫైల్)

### బాలింత మృతి

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన న్యూట్రిషన్ కిట్ ఏజెన్సీ ప్రాంతాల్లో మాతా, శిశు మ రణాలను తగ్గించడానికి ఉపయోగపడింది. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయి. ఉట్నూర్ మండలంలోని లక్కారంలో బాలింత అత్రం శ్రీ విద్య(23) రక్తహీనతతో మృతి చెందింది. కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందే శ్రీ విద్యకు పౌష్టికాహార లోపం ఫలితంగా రక్తహీనత సమస్యను ఎదుర్కోవాల్సి వచ్చింది. 40 రోజల కిందట ఆదిలాబాద్ రిమ్స్‌లో ప్రసవ సమయంలో శ్రీ విద్యకు రక్తం ఎక్కించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రక్తహీనత కారణంగా తీవ్ర అనారోగ్యం బారిన పడి శనివారం ఉదయం మరణించింది. బాలింత శ్రీ విద్య మరణంతో 40 రోజుల శిశువు అనాథగా మారిందని బంధువులు అంటున్నారు.